క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ


విద్యార్థినులతో ప్రిన్సిపాల్ తిరుమల ప్రసాద్

కొమ్మాది: సాగర్‌నగర్‌లో గల ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబరిచారు. విశాఖపట్నం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయ ఆంధ్ర వ్యాయామ మండలిలో నిర్వహించిన పోటీల్లో జె.చంద్రకళ, పి.ఇందిర, పి.కరుణకుమారి, ఎస్.సుజాత ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారని ప్రిన్సిపల్ తిరుమల ప్రసాద్ తెలిపారు. వారిని సోమవారం పాఠశాలలో అభినందించారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

భీమునిపట్నం: విజయవాడలో ఈ నెల 29న కుల వివక్ష వ్యతిరేక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సామాజిక న్యాయంపై చేపట్టే మహాధర్నాకు అందరూ మద్దతుగా నిలవాలని అఖిల భారత కార్యవర్గ సభ్యురాలు, రాష్ట్ర కేవీపీఎస్ ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ కాలనీ వద్ద ధర్నాకు సంబంధించిన పోస్టర్ సోమవారం విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీలకు మేలు జరిగేలా మహాధర్నా చేపడుతున్నామని, అందరూ తరలిరావాలని కోరారు. దళిత సంఘ నాయకులు పారుపల్లి నర్సింగరావు, భాగం కృష్ణ, బంకపల్లి కొండబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా వేణుగోపాల్ బాధ్యతల స్వీకరణ


వేణుగోపాల్‌కు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

పద్మనాభం: పద్మనాభం తహసీల్దార్‌గా కోరాడ వేణుగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను భీమునిపట్నం నుంచి పద్మనాభం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌కు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఇంత వరకు పద్మనాభం తహసీల్దార్‌గా పనిచేసిన టి.శ్రీవల్లి గాజువాకకు బదిలీ అయ్యారు.

విద్యార్థులకు అభినందనలు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని దొరతోట వద్దనున్న నవజీవన్ పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన అండర్ 14, 17 జిల్లా స్థాయి క్రీడల పోటీల కోసం జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపారు. హ్యాండ్ బాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని సోమవారం అభినందించారు. కరస్పాండెంట్ హెలన్ జాన్సన్ టైటస్ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవడం ఆనందకరమన్నారు. త్వరలో జరగబోయే పోటీల్లో ఇదే స్థాయిలో ప్రతిభ కనబరిచి అన్ని విభాగాల్లోనూ విజయం సాధించాలని కోరారు. ప్రిన్సిపాల్ లియో ఎలిజిబెత్ శ్యాం, పీఈటీ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద విగ్రహ ప్రతిష్ఠకు మట్టి సేకరణ

ఆనందపురం : స్వామి వివేకానంద విగ్రహ ప్రతిష్ఠ కోసం దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి మట్టిని సేకరిస్తున్నామని ఏబీవీపీ జాతీయ యువ వలంటీర్ లొడగల అచ్చిబాబు తెలిపారు. సోమవారం మండలంలోని లొడగలవానిపాలెం, ఆనందపురం గ్రామాలతో పాటు పోలీస్ స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏబీవీపీ కార్యకర్తలు మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా అచ్చిబాబు మాట్లాడుతూ నెహ్రూ యువ సంఘటన జాతీయ కార్యక్రమంలో భాగంగా దేశంలో ఆరు వేల గ్రామాల నుంచి మట్టిని సేకరించి స్వామి వివేకానంద విగ్రహం ప్రతిష్ఠించనున్న ఢిల్లీలోని కర్తవ్యపథ్‌కు తరలిస్తామని చెప్పారు. బియ్యం కూడా సేకరిస్తామన్నారు. దేశ సమైక్యత కోసం యువత ముందుకు రావాలని కోరారు. ఎస్.ప్రవీణ్, ఎల్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి జగనన్న రక్ష


మారికవలస యూపీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్సీ కనక మహాలక్ష్మి


అన్నవరంలో జగనన్న సురక్ష క్యాంప్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీష్

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి, మూలకుద్దు పంచాయతీల్లో మినహా 14 పంచాయతీలకు చెందిన 10 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతోంది. మంగళవారం మండలంలోని అన్నవరం పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీష్ సోమవారం సాయంత్రం పంచాయతీలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మండలంలో జరుగుతున్న సర్వే గురించి వైద్యులను ఆరా తీశారు. ఇదిలా ఉండగా తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యులు ఏబీ మల్లికార్జునరావు, శోభారాణి, విలేజ్ క్లినిక్ వైద్యులు రవీంద్ర, కల్యాణి ఆధ్వర్యంలో 14 పంచాయతీల్లో వైద్య సిబ్బంది సోమవారం ఒక్కరోజే 500 కుటుంబాలకు చెందిన సుమారు 2600 మందికి హిమోగ్లోబిన్, రక్తపోటు, మధుమేహం, డెంగీ, మలేరియా, కఫం తదితర ఏడు పరీక్షలు జరిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకుని పరీక్షలు జరుపుతున్నట్టు వైద్యసిబ్బంది తెలిపారు. అమనాంలో 65 ఏళ్ల వృద్ధుడు నక్కెళ్ల నారాయణకు పరీక్షలు జరపగా ఆరోగ్యంగా ఉన్నట్టు గుర్తించారు. అతనికి బలానికి మందులు అందించారు. అలాగే తాళ్లవలస పంచాయతీలో చిల్ల అప్పలరెడ్డికి పరీక్షలు చేయగా ఆరోగ్యంగా ఉన్నట్టు తెలిపారు. మజ్జిపేట, మజ్జివలస, లక్ష్మీపురం పంచాయతీల్లో పక్షవాత రోగులకు మందులు అందుతున్న తీరును పరిశీలించారు. వైద్య సిబ్బంది రాజ్‌కుమార్, సత్యవతి, ప్రశాంతి, గౌరిమణి, శ్రావణి పాల్గొన్నారు. ఈ సర్వే పేదల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తోంది.

పకడ్బందీగా జగనన్న సురక్ష సర్వే

మధురవాడ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జగనన్న సురక్ష ఇంటింట సర్వేని పకడ్బందీగా చేపట్టాలని జీవీఎంసీ జోన్ - 2 కమిషనర్ కె.కనక మహాలక్ష్మి ఆదేశించారు. సోమవారం సాయంత్రం జీవీఎంసీ 5వ వార్డులోని మారికవలస అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సర్వే జరుగుతున్న తీరు, ఏయే అంశాలపై సర్వే చేస్తున్నారో ఆరా తీశారు. సర్వేలో అలసత్వం వహించవద్దని సూచించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎమ్‌లు లలిత, రామలక్ష్మి తదితరులు మాట్లాడుతూ ఇంటింట సర్వేలో ప్రజల ఆరోగ్య సమస్యలు నమోదు చేయడంతో పాటు పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి చైతన్య పాల్గొన్నారు.


అమనాంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


క్రీడాకారులతో ఎంపీపీ రాంబాబు తదితరులు

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఎంపీపీ కంటుబోతు రాంబాబు సొంత నిధులు రూ.15వేలతో దుస్తులు సోమవారం అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ఔత్సాహిక క్రీడాకారులను అందరూ ప్రోత్సహించాలన్నారు. కుస్తీ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన పి.గణేష్ (బంగారు పతకం), ఎం.సందీప్ (రజత పతకం), కె.కార్తీక్ (కాంస్య పతకం) జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. హ్యాండ్ బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన టి.యోగిత, కె.మేఘన, రగ్బీలో అండర్ - 14లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన బి.రమ్యను ఎంపీపీ అభినందించారు. కార్యక్రమంలో తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు, సూరిబాబు, శ్రీను, హెచ్‌ఎం ఎ.బాలామణి, పీడీ నారాయణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకం



తగరపువలసలో ర్యాలీ నిర్వహిస్తున్న అవంతి ఫార్మసీ విద్యార్థులు

కొమ్మాది: ఆరోగ్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని, వైద్య ఆరోగ్య రంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో సహితం బలోపేతం చేయాలంటే కమ్యూనిటీ ఫార్మసీకి ప్రాధాన్యత పెరగాలని గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ప్రో వీసీ డాక్టర్ బి.గీతాంజలి అన్నారు. ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం సందర్భంగా గీతంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఫార్మసీ రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో నిపుణులకు అవకాశాలు పెరుగుతున్నాయని, రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతంలో ఫార్మాసిస్టులు తమ సేవలు పెంచుకోవాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాజా తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ఫార్మసీ దినోత్సవం

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రపంచ ఫార్మసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఫార్మాసిస్ట్ స్ట్రెంథనింగ్ హెల్త్ సిస్టమ్ పేరుతో తగరపువలసలో బంగ్లామెట్ట శివాలయం నుంచి బైపాస్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబీవీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందుత్వ పునరుజ్జీవనం కోసం దీన్‌దయాళ్ కృషి

ఆనందపురం : దేశంలో హిందుత్వ పునరుజ్జీవనం కోసం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కృషి చేశారని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పీవీవీ ప్రసాద్‌రావు పట్నాయక్ చెప్పారు. మండలంలోని వెల్లంకిలో సోమవారం దీన్‌దయాళ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రామునాయుడు, యేలూరి ధర్మావతి, బోర శ్రీను పాల్గొన్నారు.

పద్మనాభం: పద్మనాభంలోని బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్, ఆర్.శ్రీనివాసరావు, యు.అప్పారావు, పి.కృష్ణారావు, హెచ్.మహేష్ పాల్గొన్నారు.

భీమునిపట్నం: స్థానిక బీజేపీ కార్యాలయంలో అర్బన్ మండల పార్టీ అధ్యక్షురాలు కంటుభుక్త సునీత ఆధ్వర్యంలో భారతీయ జనసంఘ్ మాజీ అధ్యక్షులు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ దీనదయాళ్ సేవలను ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని కోరారు. నాయకులు చెన్నా రాము, పోలుబోతు విజయ, నల్లి సత్యం, లక్ష్మి పాల్గొన్నారు.

గణపతి మండపాల వద్ద అన్నదానాలు


గ్రంథాలయవీధిలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


సంతపేటలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పలుచోట్ల ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఘనంగా అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రంథాలయ వీధిలో స్టార్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, తెడ్లాపు అప్పలరాజు, సరగడ శివాంజనేయరెడ్డి, నీలాపు సురేష్‌రెడ్డి, జీరు రాము, మద్ది లక్ష్మి ప్రారంభించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానాన్ని 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల నరసింగరావు, వాసుపల్లి నరేంద్ర, జీరు పద్మ, చేట్ల అప్పలసూరమ్మ తదితరులు ప్రారంభించారు.

- భీమిలి మండలం దాకమర్రిలో కనకల సన్యాసినాయుడు ఆధ్వర్యంలో అన్నదానాన్ని సంకురుభుక్త ప్రకాష్, దంతులూరి అప్పలనరసింహరాజు, అల్లు చిన్నయ్య తదితరులు ప్రారంభించారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు

తగరపువలస: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భీమిలి పరిధిలో పలు మండపాల వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ ఆశిపాలెంలో భారీ అన్నదానంతోపాటు మహిళలతో కోలాటం నిర్వహించారు. శింగనబంద పంచాయతీ మద్దిలపేటలో నిర్వహించిన లడ్డూ వేలంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు ఉమామహేష్ కైవసం చేసుకోగా ఉత్సవ కమిటీ సభ్యులు అతడిని ఘనంగా సన్మానించారు. జీవీఎంసీ భీమిలి జోన్ చిల్లపేట సిగడాం మహాలక్ష్మి ఆలయం వద్ద మండపంలో గణపతికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు నీలాపు సురేష్ రెడ్డి, శంకరరెడ్డి, చిల్ల కాశీవిశ్వనాథ రెడ్డి, చిల్ల ఆదినారాయణరెడ్డి ప్రసాదాలు పంపిణీ చేశారు.


మద్దిలపేటలో లడ్డూతో ఉత్సవ కమిటీ ప్రతినిధులు

యోగా మాస్టర్ కళాధరరావు రికార్డ్


కళాధరరావును అభినందిస్తున్న డిపో మేనేజర్ గౌతమ్ ఛటర్జీ

మధురవాడ: మధురవాడకు చెందిన యోగా మాస్టర్ వీకేవీకే కళాధరరావుకు మరొక అరుదైన గౌరవం లభించింది. గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పలు బహుమతులు పొందిన ఆయనని తాజాగా గ్లోబల్ వరల్డ్ రికార్డ్ వరించింది. 59 ఏళ్ల కళాధరరావు యోగా సాధన, శిక్షణ కోసం ఇటీవల 6 నెలలు కెనడా వెళ్లారు. అక్కడ ఉండగానే ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొన్నారు. వజ్రాసనం వేస్తూ శంకు ముద్రలో 2 గంటల 7 నిమిషాల 9 సెకెండ్లు ఉన్నందుకు ఈ రికార్డు వచ్చింది. ఈయనను ఏపీఎస్ఆర్‌టీసీ విశాఖ డిపో మేనేజర్ గౌతమ్ ఛటర్జీ, ఇతర అధికారులు, సహచర సిబ్బంది అభినందించారు.

'చంద్రయాన్ - 3' విజయవంతంపై 5 నుంచి పోటీలు


ప్రధానోపాధ్యాయుడు స్వామికి పోటీల పోస్టర్ అందిస్తున్న ప్రొఫెసర్ క్రాంతికుమార్

తగరపువలస: చంద్రయాన్ – 3 విజయవంతమైన సందర్భంగా శ్రీహరికోట షార్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు అక్టోబర్ 5 నుంచి 7 వరకు భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎస్.క్రాంతికుమార్ సోమవారం వివిధ పాఠశాలల యాజమాన్యాలకు పోటీలకు సంబంధించి ఆహ్వానపత్రాలు అందించారు. విభాగాల వారీగా విద్యార్థులకు క్విజ్, పెయింటింగ్, వ్యాసరచన, సింపోజియం, పోస్టర్ ప్రజెంటేషన్, ఫొటోగ్రఫీ, బిజ్ విజ్ అండ్ స్పేస్ మేనియాలపై పోటీలు నిర్వహిస్తారు. పోటీలకు విద్యార్థుల ఎంపికలో భాగంగా ఈ నెల 27న ఇస్రో వారి నుంచి జిల్లా విద్యాశాఖకు ప్రశ్నాపత్రం, కీ విడుదల చేయనున్నారు. ఈ ప్రాథమిక పరీక్ష ద్వారా ప్రతి పాఠశాల నుంచి అయిదుగురు విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. వివరాలకు 98662 27479లో సంప్రదించాలని కోరారు.

వీధిలైట్లు వెలగక అంధకారం

జోన్ - 2 స్పందనకు 15 అర్జీలు


జెడ్సీ రాముకు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎల్లాజీ


జెడ్సీకి సమస్య వివరిస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు పాత మధురవాడలో గీత కార్మికులు నివసిస్తున్న ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగక అంధకారం నెలకొంటోందని, లైట్లు సక్రమంగా వెలిగించాలని సీపీఐ నాయకులు సత్యనారాయణ, కుమార్, వేలంగిణిరావు, తిరుపతిరావు కోరారు. ఈ మేరకు సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో జెడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. పైనాపిల్ కాలనీలోని వుమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి తాగునీటి కనెక్షన్ ఇప్పించాలని, చెట్ల కొమ్మలు తొలగించి, డ్రైనేజీ వ్యవస్థపై స్లాబులు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆ శాఖ ఆర్‌జేడీ చిన్మయి దేవి కోరారు. అలాగే జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని జనసేన నాయకుడు గంగరాజు, శంకర్ కోరారు. ఎండాడలో తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలని శంకరరావు నాయుడు కోరారు. పీఎం పాలెం బింద్రానగర్‌లో పబ్లిక్ ప్రాపర్టీ ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని జీరు సత్యనారాయణ తదితరులు కోరారు. ఇలా జోన్‌లోని సమస్యలపై అందిన 15 అర్జీలు పరిశీలించి, తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు. ఓ అధికారి స్పందన కార్యక్రమానికి వచ్చిన కొద్ది సేపటికే బయటకు వెళ్లిపోతుండడంతో జెడ్సీ కనకమహాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

భీమునిపట్నం: జోనల్ కార్యాలయంలో జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ఆరు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు, ఇంజినీరింగ్ విభాగానికి రెండు, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగాలకు ఒకటి చొప్పున వచ్చాయి. ఎగువపేట సచివాలయం లోపలకు వెళ్లడానికి దివ్యాంగులకు మెట్ల పక్కన ర్యాంపు లేనందున ఇబ్బందిగా ఉందని నూకాంబిక దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాసరపు ఎల్లాజీ తెలిపారు. అలాగే జోనల్ కార్యాలయం వద్ద యూసీడీ విభాగం మూడో అంతస్తులో ఉండడంతో దివ్యాంగులు వెళ్లలేకపోతున్నారని, అందువల్ల ఆ విభాగాన్ని కింద ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని జెడ్సీ రాము హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ మత్స్యకార ఫోరం చైర్మన్‌గా జగన్నాథం



నియామకపత్రం అందుకుంటున్న జగన్నాథం

భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర మత్స్యకార ఫోరం చైర్మన్‌గా భీమిలికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కదిరి జగన్నాథం సోమవారం నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


వినాయక వేషధారణలో యువకుడు

కొమ్మాది: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొమ్మాది అంజలి గీతాంజలి టవర్స్ అపార్ట్‌మెంట్స్ ఆవరణలో సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గణేషుని శ్లోకాలు, పాటలు, సాంస్కృతిక నృత్యాలు, కోలాటాలు, వినాయకుని చరిత్ర తెలిపే నాటకం ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

అంబేడ్కర్ విగ్రహం మార్చిన వారిపై ఫిర్యాదు


భీమిలి సీఐ రమేష్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు ఎస్సీ కాలనీలో 1989లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం వేరే చోటుకు తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన దళిత సంఘాల ప్రతినిధులతో కలిసి భీమిలి సీఐ డి.రమేష్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో కేంద్రమంత్రిగా ఉన్న పురందేశ్వరి రూ.4 లక్షలు నిధుల కేటాయింపుతో విగ్రహం పక్కన కల్యాణ మండపం నిర్మించారని గుర్తు చేశారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు దాతలు ఇచ్చిన స్థలాన్ని ఇక్కడి టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఆక్రమించుకున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. విగ్రహం స్థల మార్పునకు కారణమైనవారితో పాటు వారికి సహకరించిన టీడీపీ నాయకులు, జేసీబీ డ్రైవర్, యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారుపల్లి నరసింగరావు, జీవీ రమణ, రవ్వ అప్పారావు, భాగం లక్ష్మి, పి.కృష్ణ పాల్గొన్నారు.

సర్క్యులర్ స్టాటస్టిక్స్‌పై వర్క్‌షాపు

కొమ్మాది: గణాంక శాస్త్రవేత్త ప్రొఫెసర్ సీఆర్ రావు స్మారకంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం సర్క్యులర్ స్టాటస్టిక్స్, బిగ్ డేటా రంగాల్లో నూతన ఆవిష్కరణలపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. సదస్సును గీతం వీసీ దయానంద సిద్దవట్టం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణిత, గణాంక శాస్త్రాల్లో పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించారు. భారతీయులు గణిత శాస్త్రంతోపాటు గణాంక శాస్త్రంలో అత్యున్నత పరిశోధనలు జరిపారని, ప్రొఫెసర్ సీఆర్ రావు వంటి వారు ఆధునిక శాస్త్రాలతో గణాంక శాస్త్రాన్ని కలిపి అద్భుత ఫలితాలు సాధించి ప్రపంచానికి మార్గం చూపారని కొనియాడారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం


కృష్ణంరాజుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తగరపువలస: శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. మహాత్మా గాంధీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా కోకో కోలా ఫౌండేషన్, అక్షయపాత్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెరగాలన్నారు. ఈ 9 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించిందన్నారు. ర్యాలీ అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. సర్పంచ్ గాడు వెంకటనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల పైడిరాజు పాల్గొన్నారు.

ముగిసిన భద్రతా వారోత్సవాలు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 17న ప్రారంభమైన రోగి భద్రతా వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. రోగి భద్రత కోసం రోగులను ఎంగేజ్ చేయడం అనే అంశంపై ఆస్పత్రిలో భద్రతపై అవగాహన కల్పించారు. చివరి రోజు నేషనల్ మెడికల్ కమిషన్ ఎయిర్ మార్షల్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో ఫ్యాకల్టీ సభ్యులకు ఆన్‌లైన్ ఈవెంట్ నిర్వహించారు. డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, మెడికల్ సూపరింటెండెంట్ బీవీఎస్ రత్నకుమారి, నర్సింగ్ సూపరింటెండెంట్ వీఎల్ ప్రియాంక పాల్గొన్నారు.